


# తిరిగిరాని తనయుడు

**జి. కృష్ణశేషు**

టపాకాయల టాప్.... టాప్ చప్పుళ్ళ తోటీ, ఆటంబాంబుల ఢాం... ఢాం— శబ్దాలతోటీ, చిచింద్రీల చిటపటలతో, వెన్నముద్దల వెలుగులతో లోకం నిండా వెలుగులు విరజిమ్ముతూ రానేవచ్చింది దీపావళిపండుగ. చిన్నపిల్లల సంతోషానికి, సరదాలకి అంతేలేదు. ఇంటింటా, ఊరూరా తోరణాలుగా వరుసగా వెలిగేదీపాలు చూస్తుంటే, ఇవాళ అమావాస్యకాదు. ఈ దీపాల వెలుగులతో లోకాన్నే పూర్ణిమగా చేసాం, మోహో—!''అని చాటుతున్నాయా ఈ దివ్వెలు అనిపిస్తోంది జనసమూహానికి. మానవుని జీవితంలో అలముకున్న నిస్పృహ, బాధ, భయం అనే చీకట్లను పారద్రోలి ఆశ అనే జ్యోతిని వెలిగించుకొని దానిసహాయంతో జీవితాన్ని వెళ్లదీయాలా? ఈ దీపాల వెలుగులు మానవునికి ఇచ్చే సందేశమిదేనా? ఇదే కనుక యదార్థమయిన సత్యమయినట్లయితే కామేశ్వరమ్మ జీవితంలో అలముకున్న తన కొడుకును గురించిన బాధ, ఏమయి పోయాడో? అనే భయం తాలూకు చీకట్లను పారద్రోలి, తన కొడుకు ఏనాటికయినా తిరిగి వస్తాడు అనే ఆశనే జ్యోతిగా వెలిగించుకొని జీవితాన్ని గడిపేస్తోందంటే ఈ సత్యాన్ని ఆవిడ బాగా అర్థం చేసుకుని ఉండాలి.

ఊరంతా మెల్ల మెల్లగా దీపాల వెలిగిస్తున్నా, ఇంకా తనఇంటిముందు దీపాన్ని వెలిగించక వీధి గుమ్మంలో యోచనా ముద్రలో ఉన్న కామేశ్వరమ్మను అల్లంత దూరం నుంచే గమనించారు బజారునించి తిరిగి వస్తున్న వెంకట్రామయ్య గారు. గుమ్మంలో అడుగు పెడుతున్న తన రాకని కూడా గమనించకుండా, పరధ్యాన్నంగా ఎటో చూస్తున్న కామేశ్వరమ్మను ''కాముడూ కాముడూ— ఏమిటే అలా కూర్చుండి పోయావ్? త్వరగాలేచి దీపాలు వెలిగించు'' అంటూ మెల్లిగా వెన్ను తట్టారు వెంకట్రామయ్యగారు. ఆవిడ కదలక పోవటంతో రెండవసారి కొంచెం గట్టిగాతట్టిలేపి ''ఏంటి కాముడు అంత పరధ్యాన్నం? నువ్వు ఇలా కూర్చుంటే నాకేదో చెప్పలేని బాధగా ఉంటుంది. ఏమిటంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు? '' అంటూ ఆయన కూడా ఆవిడకి సమీపంలో గోడకి చేరగిలబడి కూర్చున్నారు.

రెండవసారి ఆయన పిలిచిన పిలుపుకి, ఆయన కరస్పర్శకి ఉలికిపడి తనప్రక్కన భర్త కూర్చుని ఉండటం చూచిన కామేశ్వరమ్మ, 'బజారుకు వెళ్ళిన ఆయన ఎప్పుడు తిరిగి వచ్చారా' అనుకుని ఆశ్చర్యంగా ''ఆ! మీరు ఎప్పుడు వచ్చారు? మీరు రావటమే తెలియలేదు సుమా! ఎంతసేపయిందండి వచ్చి?''అని, తనుకూడా ఒక ప్రక్కగా సర్దుకూర్చుంది.

''ఏమిటి కాముడూ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? దేన్నిగురించి?''అంటూ ప్రశ్నించారు వెంకట్రామయ్యగారు

''దేన్నిగురించీలేదు.'' అని తల అడ్డంగా ఊపింది కామేశ్వరమ్మ.

''దేన్నిగురించో ఆలోచిస్తున్నట్లు నిన్ను చూస్తూనే తెలుస్తోంది. నువ్వు లేదు అంటే

పోతుందేమిటి ? పండగకి అమ్మాయి, అల్లుడూ రాలేదనేనా నీ ఆలోచన?"

"కాదు."

"అబ్బాయి రామం, కోడలు జానకి రాలేదని ఆలోచిస్తున్నావా? దేన్నిగురించి, ఎవరిని గురించి ఆలోచిస్తున్నావో చెప్పుదూ?" అంటూ బ్రతిమలాడుతున్న ధోరణితో అడగసాగారు వెంకట్రామయ్యగారు.

"వీళ్లెవరి గురించీ కాదండీ. ఏవో కారణాలవల్ల, ఇబ్బందులవుతాయంగా పిల్లలు రాలేకపోతే దానికేమీ బాధలేదు. అంతగా వెళ్లాలని అనిపిస్తే మనమే వాళ్లదగ్గరికి వెళ్లచ్చు" అని సమాధానం చెప్పింది కామేశ్వరమ్మ.

"ఇంకదేన్ని గురించి నీబాధ, ఆలోచన?"

"అదే...—అదే..—మన ప్ర...సాద్."

అంటూ మాటకూడా పూర్తి చేయలేక ముఖం చేతులతోకప్పేసి ఏడవ సాగింది కామేశ్వరమ్మ.

వెంకట్రామయ్యగారికి గుండెలలో పిడుగు పడ్డట్లయింది ఆక్షణంలో. ఆమెకి ఏమని చెప్పి ఓదార్చాలి? ఎలా ఓదార్చాలి! అనేదే ఆయనకి తీర్చలేని పెద్ద సమస్యగా తోచింది. చివరికి తనమనస్సుకి స్థైర్యం చేకూర్చుకుని ఆమెముఖాన్ని చేతులలోనుంచి తొలగించి తనవైపు త్రిప్పుకుంటూ "చూడు కాముడూ, ఇటుకేసి నాముఖంలోకి ఒక్కక్షణం చూడు, నీకెంత బాధఉందో నాకూ అంతేబాధగా ఉంది వాడిని తలుచుకుంటే. నీవు ఆడదానివి కాబట్టి భోరుమని ఏడ్చి నీదుఃఖాన్ని నాముందు వెళ్లగక్కావు. నీలా నేను ఏడవనంత మాత్రంలో నా మనస్సులో బాధ లేదనా నీఉద్దేశ్యము?"

"అదికాదండీ నాఉద్దేశ్యము. మన బాబు తిరిగి రాడంటారా" అంటూ మళ్లీ ముఖాన్ని చేతులతో కప్పేసుకుని రోదించ సాగింది కామేశ్వరమ్మ.

"కాముడూ నిన్నుచూస్తే ఎలా ఓదార్చాలో కూడా తెలియటంలేదు. నన్నుచూచి నీవు, నిన్ను చూచి నేను ధైర్యంగా ఉండాలి. అంతే నేచెప్పగల్గేది. లే.... మరి" అంటూ ఆయన లేచి నుంచున్నారు. "ఊ" అంటూనే అక్కడనుంచి కదలలేదు కామేశ్వరమ్మ.

"తీరుతున్నకొద్దీ కోరికలు, ఓదార్చుతున్నకొద్దీ దుఃఖం ఎక్కువవుతూయుంటాయి. నిన్ను చూస్తే అదినిజమేనేమో అనిపిస్తోంది. రా ముందు లోపలికి పోదాము" అంటూ ఆమెచేతిని మెల్లిగా అందుకుని లోపలికి నడిపించుకెళ్లారు వెంకట్రామయ్యగారు. బయటనుంచి లోపలికి వచ్చి మంచంమీద నడుం వాల్చారేగాని, సరిగ్గా పదేళ్లకితం ఇదే దీపావళి తమనుంచి కొడుకును వేరుచేసిందనే బాధ వారి ఆలోచనలను గతంలోకి లాకెళ్లింది.

దీపావళి పండుగ రెండు రోజుల పండగనటం జేసి కామేశ్వరమ్మ తనపిల్లలు ముగ్గురికీ నరక చతుర్దశిరోజున తలంటి స్నానం చేయించి, తను తెమిలి వంటపని పూర్తిచేసి భోజనాలు కానిచ్చేసరికి ఆరోజు మధ్యాహ్నము ఒంటిగంట దాటింది. కొంచెం అలసట అనిపించినా లెక్కచేయక ఆరోజు గడిపేసింది కామేశ్వరమ్మ. మర్నాడు అసలు పండగరోజవటంతో ప్రొద్దున్నేలేచి నాలుగు పనులు సవరించుకొని వంటలో ప్రవేశించేసరికి పదిగంటలు దాటింది. పండగరోజున పనిదానికి, చాకలిదానికి అన్నం పెట్టాలనే ఉద్దేశ్యంతో దండిగా రెండు కూరలు,పప్పు,పులుసు, పచ్చడి, ఒక తీపి పిండివంట, ఒక కారం పిండివంటతో మొత్తంగా వంటఅంతా కానిచ్చేసరికి పూర్తిగా అలసిపోయింది కామేశ్వరమ్మ. పిల్లలు 'ఆకలి —ఆకలి'అని గొడవ చేయటంతో ముందు పిల్లలకి, భర్తకి భోజనం పెట్టి అన్నివస్తువులు సరిగ్గా సవరించుకుని తను భోజనానికి కూర్చోబోతే అన్నం సహించలేదు. అలసట వల్ల సహించలేదేమో అనుకొని కొంచెం మజ్జిగ త్రాగి వచ్చి మంచం మీద నడుం వాల్చిన కామేశ్వరమ్మకి చలిగుబులుతో జ్వరం రావటం ప్రారంభించింది

"అమ్మా అన్నయ్యే, నువ్వు యిచ్చిన టపాకాయలు లాక్కుంటానని అంటున్నాడే" అంటూ తల్లితో ఫిర్యాదు చేయటానికి వచ్చింది ఆరేళ్ల రాధ.

ఇంతలో బయటనుంచి వస్తున్న పదేళ్ల ప్రసాద్ రాధమాటలు విని "లేదమ్మా. నేను దాని టపాకాయలు లాక్కుంటానని అనలేదు. 'నీకు టపాకాయలు కాల్చటమంటే భయంకదే, నీవంతు టపాకాయలు నాకివ్వ'ని అడిగా నమ్మా. అంతే. చూడు ఎలా అబద్ధాలుచెపుతోందో.....!" అంటూ రాధకేసి కోపంగా చూస్తూ తనది తప్పు లేదన్నట్లుగా తల్లితో విన్నవించుకోసాగాడు ప్రసాద్.

పిల్లల గొడవతో మేల్కొన్న కామేశ్వరమ్మ "ఒరేయ్ ప్రసాద్, ఏవో అబద్ధాలు చెప్పినంత మాత్రం చేత నేను నమ్ముతాననుకున్నావటరా నాకు నీసంగతి తెలియదా! దానిసంగతి తెలియదా, వెళ్లి చక్కగా ఆడుకోండి గొడవ చేయక" అని పంపించేసింది పిల్లలని.

మళ్లీ ఇంకోగంటకల్లా "అమ్మా అన్నయ్య మన ప్రక్కఇంటి పిన్నిగారి రాముని మనటపాకాయలు తీసుకుంటుంటే కొట్టాడే. వాళ్ల రాము ఏడుస్తూ ఇంటికెళుతున్నాడే" అంటూ కామేశ్వరమ్మ ప్రక్కన జేరింది రాధ.

"కొడితే కొట్టాడులే. నువ్వు గొడవ చేయక వచ్చి నిద్రపో". అంటూ కూతుర్ని మంచంమీద పడుకోబెట్టి తను లేచివేరే మంచంమీద కూర్చుంటున్నంతలో ప్రసాద్ లోపలికి వచ్చాడు.

"బాబు, ప్రసాద్ ఇలారా." అంటూ దగ్గరకి రమ్మనమని పిలిచింది కామేశ్వరమ్మ కొడుకుని.

"ఏమిటమ్మా" అంటూ తల్లిమంచం మీదే తనూ కూర్చున్నాడు ప్రసాద్.

"ఇందాక ప్రక్కఇంటి పిన్నిగారి రాముని కొట్టావట నిజమేనా?" అని ప్రశ్నించింది కామేశ్వరమ్మ.

"ఊరికనే కొట్టలేదు. నన్నుకొడితే కొట్టాను." అన్నాడు ప్రసాద్.

"వాడు కొడితే నువ్వు తిరిగి కొట్టాలిట్రా. తప్పుకదూ. మనగాంధిగారు ఏం చెప్పారు? ఒక చెంపమీద కొడితే రెండవ చెంపచూపమని చెప్పారని చెప్పానూ. జ్ఞాపకం లేదూ?" అని ప్రశ్నించింది కొడుకుని కామేశ్వరమ్మ.

జ్ఞాపకమున్నట్లుగా తల ఊపాడు ప్రసాద్.

"మరి ఎందుకు వాణ్ణి కొట్టినట్లు?"

"మన టపాకాయలు లాక్కుంటే మావి ఎందుకు తీసుకుంటావ్! మీ ఇంట్లో ఉన్నాయిగా అవితీసుకో,అని వాడిచేయి గట్టిగా పట్టుకుని మన టపాకాయలు వాడిదగ్గర నుంచి తీసుకున్నానమ్మా. నేను అలాచేశానని ఉడుకుమోత్తనంతో నన్నుకొట్టి చెయ్యి వదిలించుకొని పారిపోతుంటే నేను వాడిని కొట్టానూ నాతప్పేమీ లేదు." అని తల్లికేసి చూడసాగాడు ప్రసాద్.

"వాళ్లరాము నిన్ను కొట్టడం తప్పే కాదనను. కానీ, నువ్వు వాడిని కొట్టకూడదు! వాళ్ల అమ్మకి చెప్పాలి." అంటూ ప్రసాద్‌కి నచ్చజెప్పబోయింది కామేశ్వరమ్మ. తల్లి ఆవిధంగా చెప్పటం ప్రసాద్‌కి నచ్చలేదు. "సరలె వెళ్ల ఆడుకో." అనేసి మంచం మీద పడుకుంది.

**పిల్లలందరూ [illegible] - కోలా ఆడుకో**

సాగారు. జ్వర తీవ్రత హెచ్చుతున్నందువల్ల ఈ గొడవలేవీ కామేశ్వరమ్మ చెవి కెక్కటం లేదు. మగతగా మంచంమీద పడుకున్న కామేశ్వరమ్మను "కాముడూ కాముడూ? పడుకున్నావేం? ఎలావుంది నీకు?" అంటూ పలకరించి, ఆవిడవంటి మీద చేయి వేసిచూసిన వెంకట్రామయ్యగార్కి ఒళ్ళు వెచ్చగా తగిలింది. "మందు తీసుకువస్తాను. నువ్వు కాస్త ఓపిక తెచ్చుకుని లేచి ముఖం కడుక్కుని బట్టలు మార్చుకో. పండగ పూట నువ్వు ఇలా పడుకుంటే పిల్లలు చిక్కుముఖాలు వేస్తారు. లే". అని చెప్పి మందుతీసుకు రావటానికి బయటికి వెళ్ళారు వెంకట్రామయ్యగారు.

సూర్యాస్తమయం అవటంతో ఇంటింటా మెల్లి మెల్లిగా దీపాలు వెలిగించటం ప్రారంభించారు. 'అమ్మలేచి దీపాలు పెట్టే ప్రయత్నంలో లేదేమో......' అని అనుకున్న రామమూర్తి, కామేశ్వరమ్మ మంచం దగ్గరకు వచ్చి "అమ్మా పడుకున్నావేం? ఒంట్లో బాగా లేదా! మందుతేనా?" అని అడిగాడు.

"నాన్నగారు మందుతేవటానికి వెళ్ళారులే. నువ్వు కాస్త ప్రమిదలు అవీ సరిగ్గా వత్తి నూనె వేసిఉంచు. నేను లేచి వెలిగిస్తాను." అని కళ్ళు మూసుకు పడుకుంది కామేశ్వరమ్మ.

బయటనుంచి గొడవగా అరుచుకుంటూ వచ్చిన రాధ "అమ్మా అందరూ దీపాలు పెడుతున్నారే...... లే......" అంటూ తల్లిని కుదుప సాగింది.

# తిరిగిరాని తనయుడు

రాధ కుదుపుకి విసుగు పుట్టిన కామేశ్వరమ్మ "ఫో ఇక్కడనుంచి." అని ఒక్క కసురు కసిరింది. దానితో చిక్కముఖం వేసుకుని బయటికి వెళ్ళిపోయింది రాధ. అలా పడుకుని ఉండిపోయిన కామేశ్వరమ్మకి ఎంత సేపయిందో తెలియలేదు. గాలి దుమారంలా లోపలికి వచ్చిన ప్రసాద్ తల్లి పడుకుని ఉండటం చూచి పిల్లిలా తల్లిని సమీపించి "అమ్మా పడుకున్నావేం?" అని అడగటం తడవాయిగా "ఇందాకటినుంచి చూస్తున్నాను ఒకటే గోల. ఫో అవతలకి." అని కళ్ళు విప్పి చూడకుండానే విసుక్కుంది కామేశ్వరమ్మ. అలా విసుకున్న తల్లికేసి ఆశ్చర్యంగాచూచి కళ్ళనీళ్ళు కార్చ సాగాడు ప్రసాద్. ఇదంతా దూరం నుంచి చూచిన రామమూర్తి, ప్రసాద్‌ని బయటికి తీసుకుని వెళుతుంటే, వెంకట్రామయ్యగారు మందు తీసుకుని లోపలికిరావటం జరిగింది. ఇదేమీ తెలియదు కామేశ్వరమ్మకి.

మందుతాగిన తరువాత మెల్లిగా లేచి, దీపాలు వెలిగించి, పిల్లలు టపాకాయలు కాలుస్తుంటే గమనించ సాగింది కామేశ్వరమ్మ. ప్రసాద్ ముఖంలో ప్రొద్దున్నఉన్న హుషారు రాత్రి టపాకాయలు కాలుస్తుంటే కనిపించలేదు ఆవిడకి. 'ఎందుకని అల్లా ఉన్నాడా?' అని ఆలోచించ సాగింది. మధ్యాహ్నం తను చెప్పిన సమాధానము నచ్చలేదేమో, మెల్లిగా నచ్చచెప్పవచ్చులే అనుకుంది. రాత్రి భోజనం దగ్గరకూడా కెలికేసి లేచి పోయిన ప్రసాద్‌ను చూస్తే ఆశ్చర్యం వేసినా, ఆకలిలేక తినలేదేమో అని సరిపెట్టుకుంది. పండగ అలసటతోటీ, ఒంట్లో బాగుండని అలసట వల్ల పడుకున్న వెంటనే నిద్రపట్టింది కామేశ్వరమ్మకి. ఆమెతోపాటు ఇంటిల్లిపాదీ అంతా నిద్రపోయారు.

ప్రొద్దున్నే పనిమనిషి పిలుపుతో మేల్కొన్న కామేశ్వరమ్మ ప్రసాద్ మంచం ఖాళీగా ఉండటం, మిగతాఅందరూ పడుకుని ఉండటం, తలుపులు తీసి ఉండటం చూచి నోటమాటరాక నిర్ఘాంత పడి అలాగే చూడసాగింది. కొద్దిసేపటికి తేరుకుని "ప్రసాద్.... ప్రసాద్........" అని గట్టిగా పిలుస్తూ ఇల్లంతా కలయజూచిన కామేశ్వరమ్మకి ఆమె పిలుపేతప్ప సమాధానం వినపడలేదు. "ఏమండీ మన ప్రసాద్ ఎక్కడికి వెళ్ళాడో కనిపించటంలేదు" అంటూ వెంకట్రామయ్యగార్ని లేపింది కామేశ్వరమ్మ.


"ఏమిటీ!" అంటూ లేచిన వెంకట్రామయ్యగారు కూడా ఇల్లంతా వెదికారు కానీ, ప్రయోజనం లేక పోయింది. అందరిళ్ళకీ వెళ్ళి "మా ప్రసాద్ మీఇంటికి వచ్చాడా?" అని అడిగిన ఆయన ప్రశ్నకి "లేదు". అన్నసమాధానమే వచ్చింది. చుట్టుప్రక్కల అంతావెదకటానికి అందరూ తలోమూలకి వెళ్ళారు. ఎక్కడా ప్రసాద్ జాడ కనిపించలేదు.

పల్లెటూరు అవటంతో అందరూ కామేశ్వరమ్మ చుట్టూ చేరారు పరామర్శకి.

"చూడు కామేశ్వరమ్మ ఒదినా? పిల్లవాడు ఎక్కడికి వెళ్ళినట్లు? రాత్రి నువ్వు వాడిని ఏమయినా కేకలేశావా?" అని ప్రశ్నించింది ప్రక్క ఇంటి పుల్లమ్మ.

"లేదండీ" అని కళ్ళనీళ్ళు పెట్టుకో సాగింది కామేశ్వరమ్మ. "'మహా వెళితే మటుకు ఎక్కడికి వెళతాడులే. మీ మీద కోపంతో మేనత్తగారి వూరువెళ్ళాడేమో? డబ్బులు ఏమైనా తీసుకు పోయాడో— ఏమో— చూసుకోండి. నే వస్తా." అంటూ అక్కడనుంచి జారుకుంది ఎదురింటి మీనాక్షమ్మ.

"ఏం పిల్లలోనమ్మా, వేలెడంత లేక పోయినా పౌరుషాలు మటుకు మూరెడంత ఈ పిల్లలకి. ఏంపోయేకాలమో......పౌరుషం ముందుపుట్టి పిల్లలు తరువాత పుట్టేలా ఉంది చూ...తే." అంటూ వ్యాఖ్యానిం



చింది నాలుగిళ్ల అవతల ఉంటున్న వెంకమ్మ.

వచ్చేపోయేవారి పరామర్శలతో అలసిపోయింది కామేశ్వరమ్మ. ప్రక్కనే ఉన్న బస్తీకి వెళ్లి, చెల్లెలి ఇంట్లో కొడుకు లేకపోవటం చూచి తెలిసున్న బంధువులందరికీ టెలిగ్రామ్‌లు ఇచ్చి వచ్చారు వెంకట్రామయ్య గారు.

పొద్దుట నుంచి వంటఇంట్లో పిల్లి పొయ్యిలోంచి కదలలేదు. సాయంకాలమయినా వంట చేసేసూచనలు ఏమీ కనిపించలేదు వెంకట్రామయ్యగార్కి. కామేశ్వరమ్మ మతిపోయిన దానిలా అలా మంచం మీద పడుకుని ఏకధారగా కళ్ల వెంట నీళ్లు కారుస్తూనే ఉంది. ఇల్లంతా నాలుగు మూలలా వెదికారు. వెంకట్రామయ్యగారు భార్యకోసం. కామేశ్వరమ్మ ఉన్న గదిలోకి వచ్చి ఆవిడ ఉన్న స్థితిని చూచిన వెంకట్రామయ్యగార్కి కూడా కళ్ల నీళ్లాగలేదు. పెద్దవాళ్లు తామిద్దరే అలా అధైర్యపడితే పిల్లలు అసలే ఉండలేరని ధైర్యంతెచ్చుకుని, కామేశ్వరమ్మని ఓదార్చే ప్రయత్నంలో మెల్లిగా వెళ్లి ఆవిడ పడుకున్న మంచం పట్టెమీద కూర్చుని "కాముడూ —ఇలా బాధపడితే ఎలా చెప్పు ? నువ్వు కొంచెం ధైర్యంతెచ్చుకొని ఇంట్లో తిరుగుతేనే, నేనయినా, పిల్లలు అయినా ఈ ఇంట్లో ఉండగలుగుతాను. నిన్ను ఈ స్థితిలో చూస్తూ మేముండలేము. మనవాళ్లందరికీ టెలిగ్రాములు యిచ్చాను. ఎవరిదగ్గర కెళ్లినా మన ప్రసాద్‌ని వాళ్లు తిరిగి పంపించేస్తారు. మన బాబు తప్పక తిరిగి వస్తాడు. లే." అని అనేకవిధాల వెంకట్రామయ్యగారు ఓదార్చినవిూదట, ఆపూటకి ప్రక్కయింటి పుల్లమ్మగారు ఇచ్చిన కూర, పచ్చడితో భోజనాల తతంగం ముగించింది కామేశ్వరమ్మ.

* * *

మంచంమీద పడుకునిఉన్న కామేశ్వరమ్మ వెంకట్రామయ్యగార్లకి గతంలో జరిగినదంతా కళ్లకు కట్టసాగింది.

* * *

కాలచక్రం ఆగకుండా తన గమనాన్ని అని సాగిస్తూనే ఉంటుంది. వారం రోజులు గడిచాయి. ప్రతిరోజూ పోస్టుమేన్ రాకకోసం ఉత్తరాలకోసం ఎంతో ఆదుర్దాగా ఎదురు చూచిన కామేశ్వరమ్మ దంపతులకి నిరాశే మిగిలేది. బంధువులు అందరి దగ్గరనుంచీ "ప్రసాద్ మా యింటికి రాలేదు" అని







## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవుచున్నది, మీ సరియైన పర్యవసానము గురించిన్ని మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన విరునామాన్నూ, వెంటనే వ్రాసివంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, సిధినిక్షేపములు, లాటరీ, ఆకస్మిక ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1.25 పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A. W. P.)
P. O. BEAS (Amritsar.)

M&H M&H M&H M&H M&H M&H M&H

M&H

# TUSSANOL

టస్సానాల్


బాధ, నొప్పి గలిగించు దగ్గునకు నిశ్చయంగా ఉపశమనము చేకూర్చు దగ్గు నివారిణి. రక్తము ఒకేచోట అధికముగా కూడుటను నివారించును.

**MARTIN & HARRIS PRIVATE LTD.**
MERCANTILE BUILDING, LALLBAZAR
CALCUTTA-1

M&H M&H M&H M&H M&H M&H M&H

సంహా

క్షీణించిన ఆనందం. బలం. శక్తిని తిరిగి
... పొందుటకు ఆశ్చర్యకరమైన మందు. నరాల బలహీనత
... వాడేక్షణం. 1 సీసా రు 11-50
స్పెషల్ రకం అర్ధం గుణంకు రు. 27/-
వయస్సు పంపుతూ జవాబుకు కవరు పంపాలి.
డాక్టర్ రత్నం సన్స్,
Sex Specialists (Estd 1904)
... మార్కెట్ వద్ద, ... బిల్డింగ్స్
హైదరాబాద్-36 (ఆంధ్రప్రదేశ్)



సిగ్గుపడకు! అది ఆడపిల్ల
ఏదు కోడు! మధుర పానీయం!
ఎంబ్రోసియా
చిన్నా పెద్దా అందరూ వాడతగిన
ఉత్తమ పండ్లరస పానీయం!

వీరెన్నో రకాలు
రుచి చూసి ఉంటారు
ఇవి వాటన్నిటికన్నా
మిన్న

బాలాజీ
వక్కపొడి

అసలైన ఆంధ్రుల తయారీ
తయారుచేయువారు
శ్రీ బాలాజీ ఇండస్ట్రీ
ప్రకాశం రోడ్డు, విజయవాడ-2.
న్యూఢిల్లీ - సికింద్రాబాద్ - మద్రాసు
ఆంధ్ర ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో
మా 1153 & 1154 స్టాల్సు
సందర్శించండి
POLAR 81-


# తిరిగిరాని తనయుడు

సమాధానం వచ్చింది. ఆఖరిసారిగా వచ్చిన ఉత్తరం చూసుకున్న కామేశ్వరమ్మ దుఃఖానికి అంతేలేదు.

"బాబూ ఈ వారం రోజులు బ్రతికున్నానంటే ఏవూరయినా వెళ్ళావేమో, ఎవరింటికయినా వెళ్ళావేమో తిరిగి వస్తావు అనే ఆశతోనే బాబు. ఇవాళ్టితో ఆ ఆశ కూడా వృధా బాబూ, ఎందుకు నాకింత శిక్ష విధించావు ? మొన్న రామం చెపితే తెలిసింది. నిద్రమత్తుతో, జ్వర తీవ్రంతో నేను పడుకునివుంటే నీవు నా దగ్గరికి వచ్చి "అమ్మా పడుకున్నావేం ?" అని అడిగితే పాపిష్టిదాన్ని విసుక్కున్నానుట. బాబూ . . . నువ్వు అని అనుకోలేదురా. కళ్ళు విప్పిచూడనైనా చూశానుకాదు. నువ్వు అని అనుకుని ఉంటే అలా కసురుకునేదాన్నే కాదురా. నీవు మాటపడని అభిమానధనుడవని తెలిసుండీ నిన్ను అనవసరంగా, కారణంలేకుండా ఎందుకు విసుక్కుంటాను? నా బాబుకదూ .... అమ్మ తెలియకచేసిన ఈ తప్పుని మన్నించి తిరిగి రావూ ! నీకు ఏం కావాలన్నా ఇస్తాను బాబు. ఈ ఒక్కతప్పు మన్నించు. తెలియక చేశాను. నేను లేకండా, మమ్మల్నందరినీ వదిలిపెట్టి నీవు ఒక్కడివి ఎలా ఉండగలవు బాబు ? నా బాబుకదూ ? నన్ను మన్నించి తిరిగిరావూ ....!" అంటూ ఏడ్చి ఏడ్చి మూర్ఛపోయింది కామేశ్వరమ్మ. ఆరోజు ఆమెని మళ్ళీ మామూలు మనిషినిచేసేసరికి ఇంటిల్లిపాదికీ శోష వచ్చినంత పనయింది.

* * *

ప్రసాద్ పసివాడుగా ఉన్నప్పటినుంచి ఎంతో తెలివిగా మసలటం కామేశ్వరమ్మకి బాగా తెలుసు. ఒకరోజు కామేశ్వరమ్మ నీళ్ళు పారపోస్తున్న ఏడాది నిండని ప్రసాద్‌ను కోపంగా చూసి "హాయి ! అమ్మా! నీళ్ళు పారపోస్తే కొడతా" అని అనటం తడవాయి ఆ అల్లరిపని మానేసి నిజంగా కొట్టినట్టే ఏడవసాగాడు. తరువాత ప్రసాద్‌ను సముదాయించేసరికి కామేశ్వరమ్మకి నీరసం వచ్చినంత పనయింది. కొంచెం, కొంచెం పెద్దవాడు అవుతున్నకొద్దీ తల్లి సంతోషంగా ఉందా, కోపంగా ఉందా అని కనిపెట్టి మరీ మసులుకునేవాడు. స్కూల్లో చేర్చింది మొదలు శ్రద్ధగా చదువుకుంటూ మాష్టర్లచేత మాట పడకుండా మెలిగేవాడు. తోటి పిల్లలు మాష్టర్లచేత చివాట్లు తింటూ, దెబ్బలు తింటుంటే అవనీ తనకే తగులుతున్నట్లుగా బాధపడేవాడు. ఒకరోజు తల్లితో "అమ్మా మా స్నేహితులే మాష్టర్ల చేత తిట్లుతింటూ, దెబ్బలు తింటారే. చక్కగా చదువుకుంటే దెబ్బలు తినరుగా. అలా చేయరు. నన్నుమటుకు ఎవరయినా ఉట్టినే తిడితే నేను వూరుకోలేను" అని చెప్పాడు ప్రసాద్. కామేశ్వరమ్మ తన కొడుకు అభిమానధనుడు అని పొంగిపోయింది ఆరోజు. ఆ అభిమానమే ఇంట్లోనుంచి వెళ్ళిపోయేలా చేసిందని బాధపడింది ఈరోజు.

* * *

ఒకరోజు ఇంట్లో ఉన్న వస్తువులు, బట్టలూ సవరించుతున్న కామేశ్వరమ్మకి ప్రసాద్ బట్టలన్నీ ఒక్క జత కూడా పోకుండా పెట్టినవి పెట్టినట్లుగా కనిపించాయి. కనిపించనిది అల్లా ఒక్క వంద రూపాయలనోటే. ఆరోజు కామేశ్వరమ్మ నిర్ఘాంతపడి అలా మామూలు ఎంతసేపు కూర్చుండిపోయిందో ఆమెకే తెలియదు. స్కూలునుంచి వచ్చిన రాధ "అన్నంపెట్టవే ?" అనటంతో ఈ లోకంలోకి వచ్చింది. "చూడు రాధా! మా అన్నయ్య, అదే—అదే— నా బాబు, నామీద అలిగి ఒక్కజత బట్టలయినా తీసుకెళ్ళకుండా వెళ్ళాడు. బాబూ, నీవు కట్టుబట్టలతో, వంద రూపాయల నోటుతో, పదేళ్ళయినా నిండని నీవు ఈ ప్రపంచకంలో ఎలా బ్రతుకుతావు బాబూ? నేను నిన్ను విసుక్కున్నానే అనుకో, దానికి నాకు ఇంత శిక్ష విధించాలా ? నిన్ను కన్నతల్లిగా, నీ బాగోగులు చూసేదానిగా నిన్ను విసుక్కునేపాటి అధికారం లేదా బాబూ ? నవమాసాలు కష్టపడి కని పెంచిన తల్లిని కానా ? నిన్ను గురించిన బాధ నాకు కాకపోతే ఇంకెవరికుంటుంది చెప్పు ? ఎక్కడ ఉన్నావో ? ఏం అగచాట్లు పడుతున్నావో ? అనే ధ్యాసేగాని వేరే ఏమీ ఆలోచించలేకుండా ఉన్నానురా బాబు. ఆత్మాభిమానం ప్రతి మనిషికీ ఉండవలసిందే. కాదనను. కానీ, ఎదుటివారు మనని ప్రేమిస్తున్నారా? లేదా? అనే విషయం ఆలోచించాలి. అవసరమైతే ఎదిరించి నిలబడి నీ తప్పేమీ లేదని చెప్పి ఎదుటివారు క్షమాపణ చెప్పుకునేలా చేయాలి. అంతేకాని, నీవు పారిపోతే ఎలా చెప్పు ? అయినా నీకు ఆలోచించేటంత వయసు కూడా లేదు. 'అమ్మ కోప్పడింది. అమ్మకి ప్రేమ లేదు' అని అనుకున్నావే గాని నీకోసం మేము బాధపడతామని అనుకోలేదు. మేము నీకోసం ఇంతగా బాధపడతామని నీవు ఆలోచించి ఉండవు. ముఖ్యంగా నేను నీకోసం ఇల్లా ఏడుస్తానని నీవు ఆలోచించలేదు. నాకు తెలుసు. నీవు ఏమాత్రం ఆలోచిం

చినా ఇల్లు వదిలి వెళ్ళేనా[illegible]. బాబూ నిన్ను ఎప్పటికి చూడకల్గుతా[illegible] ?" అంటూ ఏమి ఏమిటో మాట్లాడుతున్న తల్లినిచూస్తే రాధికి కాళ్ళు చేతులు గజగజ వణకసాగాయి. వెళ్ళి తండ్రిని పిలుచుకువచ్చింది. లోపలకి వచ్చిన వెంకట్రామయ్యగారు కామేశ్వరమ్మతో "కాముడూ—నిన్ను చూస్తే మూర్తీభవించిన శోకదేవతలా ఉన్నావు. ఇప్పటికే చిక్కి సగం అయ్యావు. మన ఆఖరి ప్రయత్నము, పేపరులో ప్రకటన కూడా వేయిస్తాను ఏమంటావ్ ?" అన్న ఆయన ప్రశ్నకి సరే నన్నట్లుగా తల వూపింది కామేశ్వరమ్మ, కళ్ల నీళ్లు తుడుచుకుంటూ.

పేపర్లో వేయించిన ప్రకటన ఫలితంగా ఎవరో ఒకరు వచ్చి "మీ అబ్బాయిని ఫలానా చోట చూశాము" ని చెప్పేవారు. ఆశగా ఆ ఆ వూర్లు వెతుగెత్తిన వెంకట్రామయ్యగారికి నిరాశే మిగిలేది. తన భర్త ప్రసాద్‌ని తప్పకుండా తీసుకువస్తాడు అని ఎదురుచూచే కామేశ్వరమ్మ, భర్త ఒంటరిగా తిరిగి రావటంతో హతాశురా లయ్యేది.

* * *

ఇరుగు పొరుగు చెప్పిన సలహాలను అనుసరించి దేవుళ్లకి మొక్కుకుని, గ్రహశాంతులు చేయించి, పూజలు చేయించేది కామేశ్వరమ్మ. తన కొడుకు ఈ లోకంలో బతికి లేడేమో—అన్న సందేహం రాగానే మనిషి నిలువెల్లా గజ గజ వణికిపోయేది. అలాంటి దుష్ట ఆలోచన వచ్చినందుకు పరిహారంగా దేవుడి పటం దగ్గరకెళ్ళి, దీపం వెలిగించి "నా బాబు నా దగ్గర లేకుండా దూరంలో ఉన్నాసరే నాకు కొంత సంతోషమే. కానీ, నా బాబు ఈ లోకంలో ఎక్కడో అక్కడ సుఖంగా ఉండేలా చూడు భగవాన్" అంటూ ప్రార్థించేది.

ఎవరయినా వచ్చి "మావాడు మీ ఇంటికి వచ్చాడా ?" అని అడిగితే చాలు కామేశ్వరమ్మకి దుఃఖం ముంచుకువచ్చేది. ఆ పిల్లవాడు తల్లిదండ్రుల దగ్గిర క్షేమంగా ఉన్నాడు అన్న కబురు తెలుసుకునేదాక తోచేదికాదు కామేశ్వరమ్మకి.

* * *

మంచి సంబంధం కుదరటంతో కూతురు రాధ పెళ్లి చేశారు కామేశ్వరమ్మ దంపతులు. పందిట్లో అంతా సందడిగా ఉన్నా కామేశ్వరమ్మ హృదయం మటుకు శూన్యంగానే ఉంది. పందిట్లో [illegible] సరదాగా [illegible]ని [illegible] పిల్లలు పెట్టుకుంటున్న [illegible] కామేశ్వరమ్మను అటువైపు పనిఉండి వచ్చి చూచిన క్రొత్త వియ్యపురాలు "అయ్యో ! వదినగారూ ! అలా బాధపడుతున్నారు ఏమిటి ? మీ అమ్మాయి గురించా? ఆడపిల్లలు పెళ్లిళ్లు చేశాక పరాయి ఇళ్లకు వెళ్లరూ ? మీరు రాలా, అలాగే మీ అమ్మాయి మా ఇంటికి వస్తుంది. ఏం బాధపడకండి. ఇది లోకంలో రివాజు" అంటూ ఓదార్పు మాటలు చెప్పింది. కామేశ్వరమ్మ తన బాధ అంతా తిరిగిరాని కొడుకుని గురించని, కూతుర్ని గురించి కాదని చెప్పలేకపోయింది ఆరోజు.

* * *

రాంమూర్తి చదువు పూర్తయి ఉద్యోగం దొరికిన వెంటనే మంచి పిల్లను చూచి పెళ్లి చేసి వాళ్ల బాధ్యత తీర్చుకున్నారు కామేశ్వరమ్మ, వెంకట్రామయ్యగార్లు. రాంమూర్తి ఉద్యోగం వూరు వెళుతూ "అమ్మా, మీ రిద్దరూ మాకూడా వచ్చి మాతోటే ఉండండి. అందరమూ ఒకచోటే ఉందాము" అని బతిమలాడాడు.

కామేశ్వరమ్మ మటుకు అందుకు అంగీకరించక "మేము ఇక్కడే ఉంటాము. మన ప్రసాద్ ఏనాటికయినా తిరిగివస్తే ఇక్కడికే వస్తాడు. వాడికి ఈ వూరు, ఈ ఇల్లు గుర్తు. మీరు వెళ్లిరండి" అని కొడుకుని, కోడల్ని సమాధానపరచి, వాళ్లని సాగనంపింది.

* * *

మంచంమీద పడుకుని గతాన్ని తల్చుకుంటున్న కామేశ్వరమ్మ, వెంకట్రామయ్యగార్లకి, ఒకదాని వెంట ఒకటి లోగడ జరిగిన సంఘటనలన్నీ వరుసగా సినిమారీళ్లలా జ్ఞప్తికి వచ్చాయి. అలా మంచంమీద పడుకునిఉన్న కామేశ్వరమ్మకి వరాకుగా ఒక్క కునుకు పట్టిందో లేదో, ఇంతలో ఎవరో తలుపు చప్పుడు చేయటం వినిపించింది. "ఎవరు వారు ?" అంటూ తలుపు దగ్గర కెళ్లిన కామేశ్వరమ్మకి, చేతిలో సంచీతో ఒక నూతన వ్యక్తి దర్శనమిచ్చాడు. "ఎవరు కావాలండి ? మీరు ఎవరు ?" అని ప్రశ్నించిన కామేశ్వరమ్మకి "వెంకట్రామయ్యగారి ఇలు ఇదేనాండి ? నేను వారి అబ్బాయిని. హరి ప్రసాద్‌ని" అని సమాధానం చెప్పాడా నూతన్న వ్యక్తి దీపపు వెలుతురులో ఆ వ్యక్తిని తన ప్రసాద్‌గా గుర్తించిన కామేశ్వరమ్మ "బాబు ప్రసాద్— వచ్చావా! ఎన్నాళ్ల కెన్నాళ్లకి నిన్ను చూశానురా ! రా బాబు—లోపలికిరా" అంటూ కలవరిస్తున్న కామేశ్వరమ్మని "ఏంటి కాముడూ—కలకన్నావా ? కలవరిస్తున్నావులే ..." అని లేపారు వెంకట్రామయ్యగారు.

"అయ్యో కలా ! ఎంత మంచి కల. నా బాబు నా దగ్గరికి వచ్చినట్టు కల గన్నాను. ఈ కల నిజమయితే బాగుండు" అనుకోసాగింది కామేశ్వరమ్మ. ●

